ప్రజాశక్తి
బుధవారం 25 అక్టోబర్ 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా





గిరిజన బాలిక పట్ల అమానుషం

- ఇంట్లో పని ఉందని తీసుకెళ్లి దొంగతం నేరం మోపి దాడి
- మరో ఇద్దరు మహిళల పట్ల పైశాచికత్వం
- ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు, నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - మోపిదేవి : చట్టం ముందు అందరూ సమానమే అనే మాట తరచూ మనం వింటూ ఉంటాం. కానీ ఆచరణలో ఆవగింజంత కూడా లేదన్నది అక్షర సత్యం. మూడు రోజుల నుంచి సమాజంలో పీడిత వర్గానికి చెందిన ఎస్‌టి మహిళలను ఇంట్లో పని ఉందని పిలిచి దొంగతనం అంటగట్టి పశువులను బాదినట్లుగా బాదిన సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. కృష్ణాజిల్లా మోపిదేవి మండలం కె కొత్తపాలెం గ్రామంలో ముగ్గురు ఎస్‌టి మహిళలపై ఓ వైసిపి కార్యకర్త పైశాచికంగా దాడి చేసి అమానుషంగా ప్రవర్తించాడు. రెండు రోజులు బందీలుగానే ఉండి ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని కాలం వెళ్లదీసిన బాధితులు...తాము తప్పు చేయలేదని పోలీసులకు చెబుదామన్నా వారూ పట్టించుకోకపోగా దాడి చేసి కొట్టారు.


దాడికి గురైన బాలికను మచిలీపట్నం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న జెసి

(పూర్తి వివరాలు మెయిన్, బాబ్లాయిడ్ లోపలి పేజీలో)


కేంద్రమంత్రి అమిత్ షా నుండి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సురేంద్రనాథ్ బెనర్జీ

నేషనల్ సింపోజియంలో వక్కలగడ్డ పిఎసిఎస్‌కు గుర్తింపు

కేంద్ర హోం మంత్రి నుండి ధృవీకరణ పత్రం స్వీకరణ

ప్రజాశక్తి - చల్లపల్లి : చల్లపల్లి మండలం వక్కలగడ్డ పిఎసిఎస్ నేషనల్ కోఆపరేటివ్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్–ఎన్‌సిఇఎల్‌లో కీలకమైన వాటాదారు కావడం ఇక్కడి రైతాంగానికి గర్వకారణమని పిఎసిఎస్ అధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నేషనల్ కోఆపరేటివ్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ జాతీయ సింపోజియంను కేంద్ర హోం మంత్రి, సహకార మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీనికి (మిగతా 6లో)


ఇంద్రకీలాద్రిపై నుండి గంగా పార్వతి సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

ముగిసిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీ దుర్గామల్లేరస్వామి వార్ల దేవస్థానం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. విజయదశమి పండుగ రోజున దేవాలయ యాగశాలలో జరిగిన పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఆలయ వైదిక కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విజయదశమి నాడు దుర్గమ్మను రెండు అలంకారాల్లో అలంకరించారు. మహోత్సవాల్లో గంగా పార్వతి సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంసవాహనంపై కృష్ణానదిలో విహరింపజేశారు. ఈ ఉత్సవ విగ్రహాలను ఇంద్రకీలాద్రి పైనుండి ఊరేగింపుగా తీసుకువచ్చి కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపకాంతులతో అలంకరించిన హంసవాహనంపై ఉంచి నదీవిహారం చేయించారు.

(పూర్తి వివరాలు మెయిన్, టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో)

వార్త 6లో

ప్రజా సంఘాల ఆధ్వర్యాన సాంస్కృతిక సంబరాలు


సంబరాల్లో బాలికల నృత్య ప్రదర్శన

ఉత్సవాలు దుర్గగుడివి...ఖర్చులు విఎంసివి

- నగర పాలక సంస్థపై మోయలేని భారం
- శ్రమ దోపిడీలో పారిశుధ్య కార్మికులు



ప్రజాశక్తి-విజయవాడ : శ్రీ దుర్గామల్లేరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యాన తొమ్మిది రోజులపాటు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు అయ్యే ఖర్చులను వాస్తవంగా దేవస్థానం భరించాల్సి ఉంది. కానీ ఈ భారమంతా విజయవాడ నగర పాలక సంస్థపై పడింది. పారిశుధ్య పనులతోపాటు ప్యాచ్ వర్క్స్, వాటర్ ప్యాకెట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర రూపాల్లో నగర పాలక సంస్థ రూ.60 లక్షలకు పైగా నిధులను ఖర్చు చేసింది. ఈ నిధులను దుర్గగుడి యాజమాన్యం ఎంత వరకు చెల్లిస్తుందో సందేహంగానే ఉంది. గత అనుభవాల ఆధారంగా చూస్తే ఈ నిధులు విఎంసికి వచ్చే పరిస్థితి లేదని ఇంజినీరింగ్ విభాగం అధికారులే చెబుతున్నారు. మరోవైపు దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పారిశుధ్య పనికి వినియోగించిన రోజువారీ కార్మికులకు సదరు కాంట్రాక్టర్ సక్రమంగా కూలి డబ్బులు ఎంత వరకు ఇస్తారోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారంతో ఉత్సవాలు ముగిశాయి. ముందస్తుగా విఎంసి అధికారులు నిర్ణయించిన దాని ప్రకారం ఈనెల 14వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పారిశుధ్య పనికి రోజువారీ కార్మికులను వినియోగించాలని, దుర్గగుడి దిగువన పరిసర ప్రాంతాలతోపాటు నదీ ఘాట్లు తదితర 25 ప్రాంతాల్లో వెయ్యి మంది కార్మికులు పని చేయాలని నిర్ణయించి ఈపనికి రూ.36 లక్షలు కేటాయించారు. అయితే ఈడబ్బును ముందస్తుగా విఎంసి జనరల్ ఫండ్ నుంచి సదరు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తే ఆ తరువాత ఉత్సవాలకు విఎంసి తరుపున చేసిన ఖర్చును దుర్గగుడి యాజమాన్యం విఎంసికి జమ చేసే విధంగా (మిగతా 6లో)

అమ్మో...పాములు


- రైతన్నలకు పాముల బెడద
- 105 రోజుల్లో 468 మంది బాధితులు
- ఓ రైతూ మృతి

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఏ పుట్టలో ఏ పాముందో అనే సామెత ఉండనే ఉంది. పుట్టలు, గుట్టలు, పొదల్లో పని కట్టుకొని ఎవరూ తిరగరు. అవసరమే ఆధునిక మానవుడిని అడవుల్లో తిప్పుతుంది. తాజాగా చోటు చేసుకున్న నీటి ఎద్దడితో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వరి పంటను సంరక్షించుకోవడానికి రాత్రి పగలు తేడా లేకుండా పొదలతో నిండి పాములు సంచరించే కాల్వ గట్లు, పొలాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి కృష్ణాజిల్లాలో పాముకాట్లు బెడద తీవ్రతరమైంది. పెదన మండలం నందిగామ గ్రామానికి చెందిన ఎన్.కృష్ణమూర్తి (54) అనే రైతు ఈనెల ఒకటో తేదీన పురుగుమందులు పిచికారీ చేయడానికి పొలానికి వెళ్లి పాముకాటుకు గురై మృతిచెందారు. జిల్లాలో ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు (105 రోజుల వ్యవధిలో) 468 మంది పాముకాటుకు గురయ్యారు. రోజుకు సగటున నలుగురు పాముకాటుకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే పొలాలకు నీటిని మళ్లించేందుకు వెళ్లి పాముకాటుకు గురవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

రైతన్నా జాగ్రత్త !

ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభంకాగానే జిల్లాలో పాముల బెడద అధికమవుతోంది. ఈ నేపథ్యంలో పాముకాటు మరణాలు సంభవించకుండా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. సిహెచ్‌సిలు, పిహెచ్‌సిల్లో యాంటీ స్నేక్ వీరం సీరం ఇంజక్షన్లకు అందుబాటులో ఉంచింది. అయినా కొన్ని సందర్భాల్లో పాముకాటు మరణాలు సంభవిస్తున్నాయి. పొలం పనులకు వెళ్లే రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులే ఎక్కువుగా పాముకాటుకు గురవుతున్నారు. కాల్వలు, డ్రయిన్లు, కృష్ణానదీ కరకట్ట,



సముద్ర తీర ప్రాంతంలోని ఖాళీ భూముల్లో దట్టమైన పొదలు, పుట్టలు పెరిగిపోయాయి. పాములకు ఆవాసాలుగా మారాయి. ఈ ప్రాంతాల్లో పాముల సంతతి పెరిగిపోతోంది. అవి పొలాల్లోకి చేరుతున్నాయి. పొలాల్లో గట్లపైన, పచ్చగడ్డిలో ఉన్న పాములను గమనించక వాటి సమీపంలోకి వెళ్లిన రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా పాముకాటుకు గురవుతున్నారు. ప్రస్తుత అనావృష్టి పరిస్థితుల్లో పొలాలకు సాగునీటిని అందించడం రైతులకు కష్టంగా మారింది. కాల్వల ద్వారా వచ్చే కొద్దిపాటి నీటిని వరిపైరు ఎండిపోకుండా పొలాలకు మళ్లించడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. నీటి ఇంజన్లు వాడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా పొదలతో నిండిన కాల్వ గట్లు, గడ్డితో నిండిన పొలాల గట్లు వెంట తిరగాల్సి వస్తోంది. ఈనేపథ్యంలోనే పాము కాటుకు గురవ్వకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మోకాళ్లవరకు పొడవైన బూట్లు, కాల్వలకు, పంట బోదెలకు అడ్డుగా వేసిన మట్టి కట్టలు తొలగించే క్రమంలో చేతులకు గ్లౌజులు వేసుకోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే కొంతమేర పాము కాటు నుంచి రక్షించుకునేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పాముకాటుకు గురైన వ్యక్తిని ఆలస్యం చేయకుండా దగ్గరలోని పిహెచ్‌సి, సిహెచ్‌సిలకు తీసుకెళ్లి చికిత్స చేయించాలని వైద్యులు సూచిస్తున్నారు. తక్షణ వైద్యంతో పాముకాటుకు గురైన వ్యక్తి ప్రాణాలను రక్షించే అవకాశం ఉందని చెబుతున్నారు. వైద్యుల సూచనలను వ్యవసాయ కూలీలు, రైతులు, కౌలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాధితులకు ఎంఎల్‌ఎ పరామర్శ


కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ మారం అమరయ్య ఇటీవల చేతికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుం టుండగా, నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు మంగళవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. నందిగామ పట్టణంలోని 9వ వార్డులో రిటైర్డ్ మాస్టారు జోసెఫ్ ఇటీవల చేతికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో నందిగామ నియోజకవర్గం వైసీపీ నాయకులు చిరుమామిళ్ళ చైతన్య కుమార్, నందిగామ సొసైటీ చైర్మన్ పాములపాటి రమేష్, ఎఎంసి చైర్మన్ మస్తాన్, వైస్ చైర్మన్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ ప్రారంభం


బ్యూటీ పార్లర్ ప్రారంభించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని ఎన్టీఆర్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తను శ్రీ హెర్బల్ బ్యూటీ పార్లర్‌ను నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు మంగళవారం ప్రారంభించారు. నిర్వహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు ను బ్యూటీ పార్లర్ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం


విరాళమిస్తున్న దాతలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజక వర్గంలో విద్యా రంగంలో కాకతీయ అపోలో విద్యాసంస్థలను స్థాపించి ఎందరో విద్యార్థులకు విద్యనం దించి విద్యార్థులను ప్రపంచం నలుమూలల ఉన్నత శిఖరాలకు చేర్చిన కాపా రవీంద్రనాథ్, మానవ జీవనశైలిలో మానవత్వాన్ని చాటుకున్నారు. గుత్త వారి పాలెంలో బందావన్ చారిటబుల్ ట్రస్ట్‌చే నిర్మింపచేస్తున్న వృద్ధాశ్రమానికి రామ సీతమ్మ రవీంద్రనాథ్ భాను ప్రసాద్ రూ.1,01,116లు విరాళం మంగళవారం అందజేశారు.

నగర ప్రముఖులు మాగంటి సుబ్రహ్మణ్యం కన్నుమూత



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగర ప్రముఖులు, ప్రముఖ వ్యాపారవేత్త లబ్బీపేట వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం (89) వయోభారంతో లబ్బీపేటలోని వారి నివాసంలో సోమవారం రాత్రి మృతిచెందారు. సుబ్రహ్మణ్యం 1934లో జన్మించారు. 1954నుండి విజయవాడ ఆటోమొబైల్ వ్యాపార రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను ఏర్పాటుచేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారులు, కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యం పార్థీవ దేహాన్ని నగర సెంట్రల్ శాసన సభ్యులు మల్లాది విష్ణు, నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, తొండెపు హనుమంతరావు పలువరు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు.

అన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి మండల పరిధిలోని అనిగండలపాడు గ్రామానికి చెందిన కందమళ.వెంకట సుబ్బారావు చిలకమ్మ దంపతుల కుమార్తెలు ప్రవల్లిక, ప్రత్యూష మంగళవారం ఆలయ అధికారులకు రూ.60 వేలు అందించారు. అనంతరం దాతలకు అమ్మవారి స్వామివారి శేష వస్త్రాలు ప్రసాదాలు అందజేశారు.


పోలీసు వాహనం ఢీకొని గొర్రెలు మృతి


చనిపోయిన గొర్రెలతో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బాధితులు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ హరిప్రసాద్

ప్రజాశక్తి - మైలవరం : తమ జీవనాధారమైన గొర్రెల మృతికి నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరారు. జాతీయరహదారి (30)పై బాధితులు ఆందోళనకు దిగారు. మైలవరం యాదవుల బజారుకు చెందిన పి.వెంకటేశ్వరరావు, బి.శివయ్య, సిహెచ్.శ్రీనివాసరావు, బి.నాగరాజు మరి కొంతమంది చంద్రగూడెం సమీపంలో పొలాల్లో గొర్రెలను మేపుకొని ఇంటికి తిరిగి వస్తున్నారు. జాతీయ రహదారిపై నాగేంద్ర స్వామి ఆలయంవద్ద గొర్రెలను దారి మళ్లించే క్రమంలో రహదారి ఇరువైపులా ట్రాఫిక్‌ను ఆపి నాగేంద్ర స్వామి ఆలయం వైపు గొర్రెలను తోలుతున్నారు. ఇదే క్రమంలో ఎపి 9పి 7949 నంబర్ గల విజయవాడకు చెందిన పోలీస్ వాహనం విజయవాడ నుండి తిరువూరు వైపు వెళ్తుండగా నాగేంద్ర స్వామి ఆలయం వద్ద గొర్రెలను ఢీకొట్టింది. ఈ ఘటనలో నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మతి చెందగా మరో 15 గొర్రెలకు కాళ్లు విరిగాయి. దీంతో బాధితులు ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ హరిప్రసాద్ తన సిబ్బందితో చేరుకుని బాధితులతో గంటకు పైగానే చర్చించారు. మరోవైపు రహదారిపై అర కిలోమీటర్ పైగానే వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పలువురు సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు ఆందోళన చేసేవారితో వాగ్వాదానికి దిగారు. మరోసారి ఎస్ఐ హరిప్రసాద్ న్యాయం చేస్తామని స్టేషన్‌కు రావాలని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం


ఆశీర్వచనాలందుకుంటున్న వాసు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలో ధృతరాష్టుడి పాలన అంతం చేసేందుకు జనసేన-టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి అడుగులు వేస్తారని జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు తెలిపారు. పవన్ కళ్యాణ్, లోకేష్ భేటీలో తీసుకునే నిర్ణయాన్ని బట్టి కార్యాచరణ ఉంటుందన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని లబ్బీపేట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయం జనసేన పార్టీ వీర మహిళలచే ప్రారంభోత్సవం అట్టహసంగా జరిగింది. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వేద పండితులచే ఆశీర్వచనాలు తీసుకున్న అమ్మిశెట్టి వాసు ఈ సందర్భంగా అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ విజయవాడ ప్రజలకు అండగా ఉండటానికి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పోతిన మహేష్, ఉమ్మడి కష్ణ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రాము, మైలవరం ఇంచార్జ్ అక్కల గాంధీ, బందరు ఇంచార్జ్ బండ్రెడ్డి రామ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ తూర్పు నియోజకవర్గ, సెంట్రల్ నియోజకవర్గ, పశ్చిమ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సేవల కొనసాగింపుతోనే కాట్రగడ్డకు నిజమైన నివాళి : వక్తలు


కాట్రగడ్డ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : టిడిపి సీనియర్ నేత, కాట్రగడ్డ వెంకట నారాయణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కాట్రగడ్డ బాబు ద్వితీయ వర్ధంతి ఘనంగా జరిగింది.. ఈ సందర్భంగా లబ్బీపేటలోని బాబు స్వగహంలో ఆయన చిత్రపటానికి పలువురు శ్రద్ధాంజలి ఘటించారు.. పేద మహిళలు, వద్దులకు చీరలు, పండ్లు కండ్రిక కాలనీలోని ప్రతిభ ఆఫ్సెట్ ప్రెస్ వద్ద పంపిణీ చేశారు.. సిపిఎం నేత బాబూరావు మాట్లాడుతూ వైద్య శిబిరాలు, మందుల పంపిణీ, కంటి ఆపరేషన్లు వంటి సేవాకార్యక్రమాలతో పాటు పచ్చదనం పరిశుభ్రత వంటి సామాజిక కార్యక్రమాల నిర్వహణలో బాబు కషి మరువలేనిది అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు బాబు సేవ చేశారని కొనియాడారు.. ఆయన సేవలు కొనసాగించడమే నిజమైన నివాళి అన్నారు.. బాబు తనయుడు కాట్రగడ్డ మోహన్ మాట్లాడుతూ తన తండ్రి నిర్వించిన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడిపి నేతలు కాట్రగడ్డ శ్రీను, ఫిరోజ్, సీపీఐ నాయకులు జానయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయభానుకు ముస్లింలు అండగా నిలవాలి


సమస్యల పత్రాలను చూపుతున్న ముస్లిములు

ప్రజాశక్తి - వత్సవాయి: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆదేశానుసారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హర్ దిల్ మే వైఎస్సార్ - హమ్ సబ్ జగన్ కే సాథ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్ వత్సవాయి మండలం దేసుపాలెం గ్రామం నందు మస్జిద్ ఎ మొహమ్మదియా మసీదు లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీల సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తానన్నారు. 4 పర్సంటేజ్ రిజర్వేషన్ సిఎం జగన్ కూడా కేవలం మంత్రిత్వ శాఖ మాత్రమే కాకుండా కలలో కూడా ఊహించని విధంగా ఒక మైనార్టీ ఎమ్మెల్యేకు ఉపముఖ్యమంత్రి స్థానాన్ని కట్టబెట్టారన్నారు. ఈ సందర్భం గా స్థానిక మసీదు వద్ద నెలకొన్న సమస్యలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మసీదు గురువు, షేక్ జిలానీ, దావూద్, సర్దార్, తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు


బాధితునితో మాట్లాడుతున్న శ్రీరాం తాతయ్య

ప్రజాశక్తి - వత్సవాయి : లారీ అదుపుతప్పి ముగ్గురు వ్యక్తులను ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మక్క పేట గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మక్కపేటగ్రామానికి చెందిన నూకపోగు రాజేష్, యాంద్రాతి ప్రవీణ్, పెరుమాల రాజా, ముగ్గురు పెయింటింగ్ పనులకు వెళ్లి గోపినిపాలెం రోడ్డు నుంచి తిరిగి వస్తుండగా మక్కపేట రామాలయం వద్ద జగ్గయ్యపేట నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి ముగ్గురిని ఢీకొనటంతో రాజేష్‌కు కాలు విరిగింది. వారిని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యం కోసం విజయవాడ తరలించారు. ఎంద్రాది ప్రవీణ్, పెరుమాళ్ళ రాజాకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదానికి కారణమైన వారు పెట్రోల్ బంకు దగ్గర లారీ వదిలి పారిపోయారు. రాజేష్ తండ్రి నూక పోగు ప్రసాదరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్చార్జి శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

లారీ ఢీకొని గాయాలపాలైన యువకులను టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పరామర్శించారు. తగిన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు


ప్రజాశక్తి - మైలవరం : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చండగూడెం కొత్త మార్కెట్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాలు ప్రకారం రెడ్డిగూడెం మండలం కొత్త నాగులూర్‌కు చెందిన మట్ట కొయ్య జోజి బాబు (రవికుమార్) మరుసు మళ్లీ గ్రామం నుండి ద్విచక్ర వాహనంపై నాగులూరు వెళ్తుండగా విజయవాడ నుండి తిరువూరు వెళు న్న కారు చంద్రుడు కొత్త మార్కెట్ వద్ద ఢీ కొట్టింది. ఈ సంఘటనలో జోజిబాబుకు తీవ్రగా యాలవగా పోలీసులు ఆటోలో క్షతగా త్రుని మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం విజయ వాడ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్ ప్రసాద్ తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగెలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో విద్యుత్ తీగెలు రోడ్డుపై పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నంది గామ వాటర్ ట్యాంక్ రోడ్‌లో కరెంట్ వైర్లు కిం దికి వేలాడి ప్రమాదకరంగా ఉన్నాయి. అధికా రులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

వైసిపిలో చేరికలు

పెనుగంచిప్రోలు : స్థానిక యాదవ బజారుకు చెందిన కొలుసు వీరబాబు,బుర్రి హనుమంత రావు, పేట్టేటి కోటేశ్వరి లింగయ్య, వెంకటేశ్వర్లు 5 కుటుంబాలకు చెందిన 20 మంది ప్రతిపక్ష టీడీపీని వీడి అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ప్రభుత్వవిప్, సామినేని ఉదయభాను సమక్షంలో వైసిపిలోకి చేరారు. అనంతరం సామినేని ఉదయభాను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి గ్రామ అభివద్ధి కమిటీ అధ్యక్షులు వి.రవికుమార్ పాల్గొన్నారు.



సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నియోజకవర్గంలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితు లకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు లను ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అంద జేశారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో వత్సవాయి గ్రామానికి చెందిన భూక్య సక్కుబాయికి రూ.65 వేలు, చిట్యాలకు చెందిన సజ్జనపు కోటేశ్వరమ్మకు రూ.58వేలు, మంగోల్లుకు చెందిన పెద్దినేని నరసింహారావుకు 1.50 వేలు చెక్కులను అందజేశారు.

వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు డా. చిన్న పుట్టిన రోజు సందర్భంగా వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముక్కోటి మహా మండపం వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ కార్యాలయంలో దసరా సందర్భంగా పేద మహిళలకు, విద్యార్థులకు ప్రసాదాలు అందించారు. అతిథులు దాసరి దుర్గాప్రసాదరావు వారి సతీమణి మాధవి, ఎల్.శ్రీనివాసరావు, లక్ష్మి మానస, అనంతలక్ష్మి విచ్చేసి విద్యార్థినిలకు నూతన వస్త్రాలు, విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు, పరీక్షల అట్టలు, పేద మహిళలకు చీరలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని దీపక్, బుజ్జి, జయలక్ష్మి, మల్లేశ్వరి పర్యవేక్షించారు.

ఎస్‌టి మహిళలపై దాడి అమానుషం



పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మోపిదేవి మండలం కే కొత్తపాలెం గ్రామానికి చెందిన మత్తి రాజాబాబు అనే వ్యక్తి తమ ఇంట్లో ఫంక్షన్ ఉందంటూ కొద్ది రోజులు ఇంటి పని చేయాలంటూ అదే గ్రామానికి చెందిన 18 ఏళ్ల ఎస్టీ యువతిని పనికి పిలిచి ఇంట్లో దొంగతనం జరిగిందంటూ ఆమెపై దాడి చేయడం అమానుషమని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ అన్నారు. సోమవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనలో ఆ బాధితులకు ఒళ్లంతా తీవ్ర గాయాలు కావడంతో కేసు అవ్వకుండా తప్పించుకోవాలని ప్లాన్ చేసి బలవంతంగా నేరాన్ని ఒప్పించి ఆ సాక్ష్యంతో మరోమారు పోలీసులతో కొట్టించారన్నారు. యజమాని కొట్టిన దెబ్బలకు కనీసం కనికరం చూపకుండా మరోమారు మోపిదేవి పోలీసులు గాయపరిచారని, తలకు గాయమై రక్తం కారుతున్నా పోలీసులు వైద్యం చేయించకపోగా ఆసుపత్రికి వెళితే వారి ఇల్లు తగులు పెడతామంటూ మరింత రాజబాబు భయపెట్టినట్లు తెలిపారు. నేరం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళలకు పలువురి పరామర్శ

మోపిదేవి మండలం కే కొత్తపాలెం గ్రామంలో వైసీపీ నేత దాడిలో తీవ్రంగా గాయపడి సోమవారం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఎస్టి మహిళలను జనసేన పార్టీ నాయకులు గుడివాడ శేషుబాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. బాధితులు ఎస్టీలు కాబట్టి ఎవరు అడిగే వారు ఉండరు అనుకోవడం వైసీపీ నాయకుల మూర్ఖాత్వం అని, ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేయకుండా బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన మోపిదేవి పోలీసులపైన కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యానాది మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క విజయబాబు, జిల్లా మాల మహానాడు అధ్యక్షులు దోవ గోవర్ధన్, ఎంపిటిసి బొప్పన భాను, వార్డ్ మెంబర్ కమిలి సాయి, భార్గవ, అడపా ప్రభాకర్, పప్పు సెట్ సీను తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్న మహిళలను పరామర్శించారు. పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరం ఆదినారాయణ, న్యాయవాది కర్ర సుధాకర్, తెలుగు యువత అధ్యక్షుడు మేడికొండ విజయ్ వైద్యశాలకు వెళ్లి మహిళను పరామర్శించారు. దాడికి పాల్పడిన వైసీపీ నాయకుడు రాజాబాబు, అతని సోదరి మీద ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని, అదే విధంగా మోపిదేవి ఎస్ఐ, కొత్తపాలెం సచివాలయం కానిస్టేబులపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిరివెళ్ల పుల్లారావు, తండు గంగాధర్ రావు, లంకిశెట్టి నీరజ, వసంత, శ్రీదేవి, మద్దాల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

చికిత్సపొందుతున్న మహిళలను పరామర్శించిన ఎంఎల్ఎ

మోపిదేవి మండలం కే కొత్తపాలెం గ్రామంలో గిరిజన సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు మహిళలపై రాజాబాబు దాడికి పాల్పడిన ఘటనలో మచిలీపట్నం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత మహిళలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జొన్నలు ఇంచార్జ్ నరసింహారావులు పరామర్శించారు. వారికి అవసరమైన మెరుగైన చికిత్సను అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కష్ణాజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గుర్రం బసవయ్య, అవనిగడ్డ మాజీ సర్పంచ్ నలుకుర్తి పథ్వి రాజు, కోడూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్న ప్రసాద్ పాల్గొన్నారు.



మహిళలను పరామర్శిస్తున్న అవనిగడ్డ ఎంఎల్ఎ రమేష్‌బాబు



మందుబాబుల ఆగడాలను అరికట్టాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : బందలాయిచెరువు గుడుమోటు రహదారిలో రెండు కిలోమీటర్ల మేర మందుబాబుల ఆగడాలు రోజురోజుకు శతి మించి పోతున్నాయని జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేద్కర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చీకటి పడితే మందుబాబులు ఆ ప్రాంతాల్లో చేరి మద్యం సేవించి ఆ బాటిల్స్ ను అక్కడే పగలగొట్టడంతో పాటు మా గాడి చేల గట్లపై కూడా చేశా పెంకులు పడి ఉండడంతో ఆ ప్రాంతంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారని అన్నారు. చీకట్లోనే రైతులు పంట పొలాలను చూసుకునేందుకు ఆ రహదారి గుండానే ప్రయాణించవలసి వస్తుందని, రైతులతో పాటు కూలీలు కూడా తరచూ గాజు పెంకులు దిగుతున్నట్లు చెప్పారని అంబేద్కర్ ఆరోపించారు. అందువల్ల పోలీస్ వారు ఆ రహదారిలో పెట్రోలింగ్ నిర్వహిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నట్లు అంబేద్కర్ తెలిపారు.

26 న నూతన షోరూం ప్రారంభం

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని స్తానిక మున్సిపల్ కార్యాలయం పక్కన మచిలీపట్నంలో యువతుల కోసం ఈ నెల 26 గురువారం ఉదయం 'యువతి ఫిమేల్ వరల్డ్' అనే వస్త్ర షోరూం ప్రారంబిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం షోరూం వద్ద విలేరులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతి ఫిమేల్ వరల్డ్ (ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన నూతన క్లాత్ షోం అన్నారు. ఈ సమావేశంలో కురిశెటి నాగేశ్వరరావు, తాటికొండ బద్రీనాథ్,కొప్పు నూకేశ్వరరావు, ప్రముఖ సంఘ సేవకులు గడ్డం రాజు,సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల టిడిపి నాయకుల నిరసనలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రధాన రహదారిపై దేశం చేస్తుంది రావణాసుర దహనం మనం చేద్దాం జగనా సుర దహనం పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూ రీ వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మాచవరపు ఆదినారాయణ, బండే రాఘవ, బచ్చు రఘునాథ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో సోమవారం జగనాసుర దహనం వాడ వాడలా నిర్వహించారు. సైకోపోవాలి అని రాసిన పత్రాలను ఈసందర్బంగా దహనం చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద పార్టీ నాయకులు అజ్మతుల్లా, జపన వీర శ్రీనివాస్‌తో కలసి సైకోపోవాలి కరపత్రాలు దహనంచేసి జగనాసుర దహనం నిర్వహించారు. చినఓగిరాలలో టీడీపీ మండల అధ్య క్షుడు యెనిగళ్ల వెకంట కుటుంబరావు ఆధ్వర్యంలో జగనాసుర దహనం చేశారు. ఆకు నూరులో తెలుగు రైతు నాయకుడు కాకాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కరపత్రాలు దహనం చేశారు. కాటూరులో తెలుగుయువత నాయకుడు కోడె హరీశ్, యుగబాబు తదితరులు జగనాసుర దహనం చేశారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పిలుపుమేరకు చల్లపల్లి టిడిపి శ్రేణులు 'దేశం చేస్తోంది రావణాసుర దహనం-మనం చేద్దాం జగనాసుర దహనం కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక శివాలయం సెంటర్లో సైకో పోవాలంటూ నినాదాలు చేశారు. సైకో పోవాలి అని రాసి ఉన్న పత్రాలను దగ్ధం చేశారు. చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ నభీ ఘోరి పాల్గొన్నారు. **ప్రజాశక్తి - నందిగామ** : సోమవారం రాత్రి టిడిపి ఆధ్వర్యంలో జగనాసురా దహనం నందిగామ ప్రాంతాల్లో నిర్వహించారు. తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నందిగామ పట్టణ టిడిపి కార్యాలయంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పత్రాలను దహనం చేశారు. మండలంలోని కంచెల గ్రామంలో మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, కొండూరులో మండల ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో దహన కార్యక్రమాలు నిర్వహించారు. **జగ్గయ్యపేట:** టిడిపి ఆధ్వర్యంలో తుర్లపాడు గ్రామం నుండి నందిగామ శివాలయం వరకు మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. తుర్లపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు చేపట్టిన పాదయాత్రకు నందిగామ నియోజకవర్గ ఇన్చార్జి , మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య సంఘీభావం తెలిపారు.

మంత్రి రోజా వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి హనుమాన్ జంక్షన్ : టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ కార్యాలయ శాశ్వత చిరునామా జైలుకి మార్చుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి అన్నారు. నిత్యం ప్రజల కోసం ప్రజా సంక్షేమం గురించే ఆలోచించే విజనరీ నాయకులు, టీడీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ చేయడాన్ని జీర్ణించుకోలేక మనస్తాపం చెంది వందలాది గుండెలు ఆగిపోయాయని అన్నారు. మరణించిన అభిమానులు, టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా, భరోసానిస్తా, పరామర్శించ డానికి బుధవారం నుంచి "నిజం గెలవాలి" అనే పేరుతో ఉమ్మడి చిత్తూరు జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం నుంచి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం చంద్రబాబు, లోకేష్, భువనేశ్వరిలపై మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలను పత్రిక ప్రకటన ద్వారా సాయి కల్యాణి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సాయి కల్యాణి మాట్లాడుతూ భువనేశ్వరి గురించి మాట్లాడేముందు మంత్రి రోజా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రతి స్కీమ్, కాంట్రాక్ట్ వెనక స్కామ్ కేసులలో జగన్ నుంచి మొదలుకుని నీతో సహా అందరూ జైలుకెళ్లడం నిజం అని రోజా చేసిన వ్యాఖ్యలపై కల్యాణి ఆరోపించారు. చంద్రబాబు, లోకేష్ పర్యటనలను అడ్డుకున్నట్టు భువనేశ్వరిని కార్యక్రమాన్ని వైసీపీ అడ్డుకుంటే దానికి పూర్తి బాధ్యత జగన్ ప్రభుత్వం వహించాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



మృతిచెందిన షేక్ రఫియా

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : జాతీయ రహదారిపై ఆగిఉన్న వాహనాన్ని ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమాన్జంక్షన్ బైపాస్పై ఎస్.ఎన్.పాలెం వద్ద నిడదవోలుకు చెందిన షేక్ రఫియా (22) ద్విచక్రవాహనంపై ఏలూరు వైపుకు వెళుతుండగా ముందు వెళుతున్న బొలేరో వాహనం అకస్మాత్తుగా ఆగడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న రఫియా అదుపుతప్పి వెనుకవైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ రఫియా తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందిందని వివరించారు. మతురాలి సోదరుడు షేక్ అబ్దుల్లా ఫిర్యాదు మేరకు హనుమాన్ జంక్షన్ ఎస్సై ఏడీఎల్ జనార్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు మహ్మద్ సాహెబ్

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు- గరికపర్రు రోడ్డులో శేషసాయి అపార్ట్మెంట్ సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మహ్మద్ సాహెబ్ (24) మృతి చెందాడు. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం పమిడిముక్కల మండలం పత్తేలంక గ్రామానికి చెందిన మహ్మద్ సాహెబ్ మెటార్సైకిల్పై ఉయ్యూరు వచ్చి అతని బంధువు అబ్దుల్ అజీమ్ తో కలసి తిరిగి వెళుతుండగా గరికపర్రు రోడ్డులో ఎదురుగా వస్తున్న వ్యాన్ వెనుక సైడ్ యాంగిలర్ రోడ్డుపక్కన ఉన్న మామిడిచెట్టుకు గుద్దుకుని లేచి మోటర్ సైకిల్పై ఉన్న సాహెబ్ గొంతుకు తగిలి తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందగా అజీమ్కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆసుపత్రిలో అజీమ్ చికిత్స పొందుతున్నాడు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి



వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి పంచాయతీలోని బోడగుంటలో అనుమా నాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు, బిళ్లపాటి చంటి కుమార్తె హేమ (19) అవనిగడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తోంది. మృతురాలి తల్లి చిట్టెమ్మ రోజుటిలాగే ఉదయం కూలీ పనికి వెళ్ళింది. పనికి వెళ్లి వచ్చిన తల్లి హేమ ఉరివేసుకుని మరణించినట్లు గుర్తించింది. కానీ హేమ శరీరంపై గాయాలు ఉన్నాయని బోరున విలపిస్తుంది. విషయం తెలుసుకున్న మోపిదేవి యస్.ఐ సిహెచ్ పద్మ మతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుడివాడ శేషుబాబుకు సన్మానం

ప్రజాశక్తి-ఘంటసాల : ఇటీవల అవనిగడ్డలో నిర్వహించిన స్వచ్ఛంద బంధు కార్యక్రమంలో భాగంగా జనసేన తరపున విరోచకంగా పోరాడిన గుడివాడ శేషుబాబును టిడిపి తెలుగు యువత ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామం శివారు శీలంవారి పాలెంలో దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శేషు బాబు రామాలయం విచ్చేసిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాదె వెంకటేశ్వరరావు, కొండవీటి శ్రీనివాసరావు, కొల్లా రుచిత్, హరీష్, ఘంటసాల గణేష్, లంక త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శకులతో కిటకిట

తరలివచ్చిన భవానీలు



భవానీలను ఏర్పాట్ల గురించి అడుగుతున్న ఆలయ చైర్మన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 23వ తేదీ సోమవారం విజయదశమి పండుగ రోజున పూర్ణాహుతి కార్యక్రమంతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. అయితే దసరా ఉత్సవాలు ముగిసిన తరువాల మరో మూడు రోజుల పాటు పలు జిల్లాలకు చెందిన భవానీలు మాలాధారణ ధరించి అమ్మవారి మొక్కు తీర్చుకునే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో దసరా ముగిసిన పదవ రోజు మంగళవారం శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు భవానీలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్యూ లైన్లు అన్ని ఫుల్‌గా నిండిపోయాయి. క్యూ లైనులో వున్న భవానీలను పాలకమండలి చైర్మన్ కార్నటి రాంబాబు స్వయంగా వారిని పలకరించి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.,



పురందేశ్వరికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న కమిటీ సభ్యులు

శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న పురందేశ్వరీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు దసరా ఉత్సవాల తొమ్మిదో రోజైన సోమవారం ఉదయం శ్రీ మహిషాసుర మర్దిని దేవిగా మధ్యాహ్నం నుంచి శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంతో యాత్రికులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అమ్మవారిని దర్శించుకోగా వారిని ఆలయ కమిటీ సముచిత రీతిన సత్కరించింది. అదే రోజు సాయంత్రం జరిగిన ఊరేగింపును సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడారు. 25వ తేదీ మధ్యాహ్నం దేవస్థానం ప్రాంగణంలో వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. దసరా ఉత్సవాల కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి ఉపాధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు పోతిన బేసికంటేశ్వరుడు, మజ్జి ఈశ్వరరావు, మజ్జి శ్రీనివాసరావు, కామందుల నరసింహారావు, భోగవల్లి శ్రీధర్, పోతిన వెంకట ధర్మారావు, బంక హనుమంతరావు , బెవర సాయి సుధాకర్, పణుకు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల విజయవంతానికి కృషిచేసిన అధికారులకు ధన్యవాదాలు : దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంద్రకీలాద్రిపై ఈ నెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకూ జరిగిన దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతం చేసిన అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. విజయదశమి పర్వదినం, దసరా ఉత్సవాల తొమ్మిదో రోజు సోమవారం పూర్ణాహుతి కార్యక్రమంతో దసరా ఉత్సవాలు ముగిశాయి. చండీ హోమం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమ ముగిసింది. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు శ్రమించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, డిసిపి విశాల్ గున్ని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి విధులు నిర్వహించేందుకు వచ్చిన వివిధ స్థాయిల ఉన్నతాధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి శ్రీ రాజరాజేశ్వరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్.రామారావు కలెక్టర్ ఢిల్లీరావుకు అమ్మవారి చిత్రపటం అందజేశారు.



కలెక్టర్ ఢిల్లీరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయఇఓ

కొత్తపేట పోలీసు స్టేషన్లో విజయ దశమి వేడుకలు

విజయవాడ కొత్తపేట పోలీసు స్టేషన్లో దసరా పండుగ పురస్కరించుకుని విజయ దశమి సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ సుబ్రహ్మణ్యం దంపతులు కొత్తపేట పోలీసు ఏర్పాటు చేసిన దుర్గాదేవికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్స్ ధనలక్ష్మి, శేఖర్ బాబు, రాజ నరేంద్ర, షబ్బీర్, ఎ.ఎస్.ఐలు పూర్ణచంద్ర రావు, రషీద్, స్వామి, రైటర్ బాబుజీ, కానిస్టేబుల్స్ సుబ్బారావు, వెంకట్రాది పాల్గొన్నారు.



పూజ చేస్తున్న సిఐ సుబ్రహ్మణ్యం దంపతులు



అన్నసంతర్పణ చేస్తున్న దృశ్యం

ఇబ్రహీంపట్నం : శ్రామిక నగర్ కనక దుర్గ అమ్మవారి దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. కొండపల్లి శ్రామిక నగర్ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో నవరాత్రి మహోత్సవాలు నిర్వహించారు. అమ్మ వారికి భక్తులు విశేష పూజలు చేశారు. మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేశారు.



మైలవరంలో



మైలవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి జోగి

మైలవరం : దసరా మహోత్సవాన్ని పురస్కరించుకొని తొమ్మిది రోజులుగా చేస్తున్న ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. మైలవరంలోని కోట వెనుక ఉన్న కోట మహాలక్ష్మి ఆలయంలోని అమ్మవారిని మంత్రి జోగి రమేష్ దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దంపతులు జమ్మి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితోపాటు ద్వారకా తిరుమల దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త ఎస్వీఎన్ నివృతరావు పాల్గొన్నారు. **వత్సవాయి:** వత్సవాయి పోలీస్ స్టేషన్ లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అభిమన్య మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబం సుఖ సంతోషాలతో నిండి ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లుతెలిపారు.



మైలవరంలో



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని చిల్లకల్లులోని సదాశివ బ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో లోకకళ్యాణార్థం తొమ్మిది రోజులుగా అనేక దైవ కార్యక్రమాలను, యజ్ఞ యాగాది కార్యక్రమాలు, పూజలు నిర్వహించినట్లుగా ఆశ్రమ ప్రతినిధులు తెలిపారు. సోమవారం సాయంత్రం పూర్ణాహుతితో కార్యక్రమం ముగించినట్లు రుత్వికులు తెలియజేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని 18వ వార్డు మార్కండేయ బజారులో ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి శ్రీరాం రాజగోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా సందర్శించి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని బలుసుపాడు శ్రీ గురుధాం ధర్మక్షేత్రంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుదంపతుల ఆశీస్సులు అందుకొన్న అనంతరం ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుని గురుదంపతులు సత్కరించారు. చిల్లకల్లు బిసి కాలనీలో శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోలీస్ స్టేషన్‌లో పూజలు చేసిన సిఐ హనీష్

-నందిగామ : స్థానిక మహా లక్ష్మి దేవాలయం, కన్యకా పరమేశ్వరి దేవాలయం తదితర ఆలయాల్లో విగ్రహాలను అలంకరించి పూజలు నిర్వహించారు. మంగళవారం పరిటాల, గని ఆత్కూరు తదితర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు ముగింపు కార్యక్రమం లో నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు మూరకొండ ఏడు కొండలు పాల్గొన్నారు. **నందిగామ :** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా పది రోజులుగా కనకదుర్గమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమ, మంగళవారం నందిగామ సిఐ హనీష్ ఆయుధ పూజ, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ పండు దొర, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. **కంచికచర్ల :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి. సోమ వారం దసరా పండుగను పురస్కరించుకుని స్థానిక వసంత కాలనీ, హనుమాన్ పేట, పశువుల ఆసుపత్రి రోడ్డు, జుజ్జూరు రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను మహిషాసుర మర్ధినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత కాలనీ లో విగ్రహం వద్ద మహిళలు పూలతో బతుకమ్మ ఆటలు నిర్వహించారు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సమయంలో దేవతా విగ్రహాలను ఊరేగించారు. నందిగామ మాజీ ఎంఎల్ఎ సౌమ్య పాల్గొని పూజలు నిర్వహించారు.పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకున్న సౌమ్య, తదితరులు

ఉత్సవాల తొమ్మిది రోజుల్లో 8.95 లక్షల మంది దుర్గమ్మ దర్శనం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈనెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంద్రకీలాద్రి నిర్వహించిన దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల తొమ్మిది రోజుల్లో 8,95,707 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ప్రసాదం టిక్కెట్లు 14,17,110 కాగా, రూ. 500ల టిక్కెట్లు 24,961, రూ. 300లు టిక్కెట్లు 18,249, రూ. 100ల టిక్కెట్లు 35,008, కేశఖండన టిక్కెట్లు 62,545 అమ్మకాలు జరిగినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు.

హైదరాబాద్‌లో విజయ డెయిరీ పాల ఉత్పత్తుల ఆవిష్కరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : హైదరాబాద్ మార్కెట్‌లోకి విజయ పాలు, పాలఉత్పత్తుల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం శంషాబాద్‌లోని జీయర్‌స్వామి ఆశ్రమంలో శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి చేతుల మీదగా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ దేశంలోనే అధిక ధర, బోనస్ ఇవ్వడం, పాడి రైతు, పశు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూ ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో ఛైర్మన్ చలసాని ఆంజనేయులు సారథ్యంలో కృష్ణా మిల్క్ యూనియన్ పాలు, పాల ఉత్పత్తులు కృష్ణా నది పరివాహక ప్రాంతమంతా విస్తరించాలని అభిలషించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ నాణ్యతలో రాజీ లేకుండా కృష్ణా మిల్క్ యూనియన్ ఆరు దశబ్దాలుగా వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందజేస్తుందని తెలిపారు. సమితికి పాడి రైతులు, వినియోగదారులు రెండు కన్నులని, అహర్నిశలు వారి అభివద్ధికి, సంక్షేమానికి సమితి కషి చేస్తుందని తెలిపారు. విజయ పాలు, పాల ఉత్పత్తులను హైదరాబాదు వాసులకు రేపటినుండి అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, ఉయ్యూరు అంజి రెడ్డి,వెంకట నగేష్, చలసాని చక్రపాణి , బొట్టు రామచంద్రరావు, డి.జి.ఎం సేల్స్ డి.లక్ష్మణ, సేల్స్ మేనేజర్ డి.సుబాష్, లింగస్వామి, సిఅండ్ఎఫ్ ఏజెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విజయ పాల ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న చిన్న జీయర్‌స్వామి, చైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు

అధ్వానంగా బూతిమిల్లిపాడు రహదారి



గోతులు పడిన రోడ్డు

ప్రజాశక్తి- గన్నవరం : గన్నవరం నుంచి బూతిమిల్లిపాడు.. మానికొండ వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ద్వంసం అయ్యింది. ద్విచక్ర వాహన చోదకులు ఆదమరిస్తే ప్రమాదానికి గురి కావాల్సివస్తోంది. రాత్రిళ్లు ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని చూపిస్తోంది. దాదాపు దశాబ్దం క్రిత్న ఈ రహదారిని అభివద్ధి పరిచారు. ఐదేళ్లకు రోడ్డు పాక్షికంగా దెబ్బతింది. అధికారులు రిపేర్లు చేయకపోవడంతో రోడ్డంతా పూర్తిగా పాడయ్యింది. వర్షాలకు రోడ్డు మీద నీరు ప్రవహించడంతో అడుగుకో గోయిపడింది. ప్రయాణికులు కాలుమోపలేని స్థితికి చేరింది. బుద్ధవరం వంతె న నుంచి బూతిమిల్లిపాడు పాకల వరకునుంచి తరిగొప్పల నుంచి మానికొండ వరకు దారుణంగా తయారైంది. దీనికి రిపేర్లు చేయించాలని జనాలు కోరడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతులకు ఐదు లక్షల రూపాయలు కేటాయించడంతో కాంట్రాక్టరు అక్కడక్కడా తారు రోడ్డుకు అతుకులు వేశారు. అవీ నాణ్యతగా చే యలేదని, ఫలితంగా తర్వాత వచ్చిన వానలకు మొత్తం లేచిపోయి గోతులు మిగిలాయి. లారీలు, బస్సులు, ట్రాక్టర్ల తాకిడికి అవి రాళ్లుతేలి పెద్దవిగా మారాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణ్న ప్రమాదకంగా మారింది.

● గోతులతో ప్రయాణీలకుల ఇబ్బందులు

విద్యార్థుల బాధలు వర్ణాతీతం : బుద్ధవరం వంతెన నుండి బూతిమిల్లిపాడు వరకు ఐదు కిలోమీటర్ల దూరం ఉంది. రహదారికి ఇరువైపులా వరి పొలాలున్నాయి. రోడ్డంతా గోతులు పడటంతో నడవటానికి వారు అగచాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళితే ఎక్కడ పడిపోతామో అన్న భయం వారిలో నెలకొంది. దీంతో చాలా మంది కష్టమైనా వెళ్తున్నారు. ఈ రహదారికి మోక్షం లేదని మదన పడుతున్నారు.

వృద్ధుల నానా అవస్థలు : వృద్ధులు నడచి వెళ్లలేమని ఆటోల్లో వెళ్తున్నారు. గోతులో పడి అవి కూడా ప్రమాదాల భారిన ప డటంతో జనాల బాధలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి తన కుంటుబ సభ్యులతో బైక్ మీద గన్నవరం వైపుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ గోతులో పడ్డారు. బండి మీద ఉన్న ఇద్దరు పిల్లలు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఈ సంఘటన చూసిన వారం తా పరుగున వెళ్లి వారిని లే పారు. పిల్లలను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ రోడ్డుకు మోక్షం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తారు రోడ్డుకు అతుకులు మూణాళ్ల ముచ్చటే : తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనాలు, జనాలు వెళ్లడానికి ఇబ్బంది ఎదురైంది. అధికారులు మూడు లక్షలు వ్యయం చేసి రోడ్డుకు అతుకులు వేశారు. ఆ పనులు నాణ్యతగా చేయకపోవడం తో నెల రోజులకే పోయాయి. పనులు చేసేటపుడు నాణ్యత లేకపోవడం వల్ల రోడ్డు యధాతదం గా మారి మూణాళ్ల ముచ్చటే అన్న చందంను గుర్తు చేస్తోంది.

ఎంత కాలం ఇబ్బందులు పడాలి : రామచంద్రరావు

బూతిమిల్లిపాడు ప్రధాన రహదారి సమస్య ఎవరికీ పట్టడం లేదు. విద్యార్థులు, జనా లు ప్రయాణం చేయాలంటే భయపడు తున్నారు. గ్రామంలోకి వెళ్లే పేదలు చాలా అవస్థలు పడు తున్నారు. గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంత కాలమిలా అనేది అర్థం కావటం లేదు. ప్రజల బాధలు, వెతలు ప్రభుత్వానికి పట్టడం లేదు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి : వెంకటేశ్వరరావు

ఈ రహదారి అభివద్ధికి అవసరమైన నిధుల కేటాయింపుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కా లం గడిచిపోతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావటం లేదు. దశాబ్ద కాలంగా నానా అగచా ట్లు పడుతున్నాం. చాలా మంది ప్రమాదాల భారిన పడ్డారు. ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు పెట్టారు. ఈపరిస్థితి మారాలంటే రహదారిని కొత్తగా నిర్మించాలి.



ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు రావి వెంకటేశ్వరరావు

రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలి : రావి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పొట్టదశలో ఉన్న వరి పైరును కాపాడాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. మంగళవారం గుడ్లవల్లేరు మండలంలో పలు గ్రామాల్లో రావి రైతులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వడ్లమన్నాడు గ్రామ శివారు రెడ్డిపాలెంలో, కొంకేపూడి ఛానల్ కింద చాలా గ్రామాల్లో నీటి ఎద్దడి ఉందన్నారు. తక్షణమే నీరు విడుదల చేసి పొట్ట దశలో ఉన్న వరి పైరును కాపాడాలని ఫోనులో అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నేరు రమేష్‌బాబు, బెల్లంకొండ ఏడుకొండలు, బెల్లంకొండ బసవయ్య, పామర్తి సత్తిబాబు, బెల్లంకొండ మాంకాలరావు, యార్లగడ్డ రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : తెలుగు దేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము మండలంలో డోకిపర్రు గ్రామంలో సోమవారం పర్యటించారు. విజయ దశమిని పురస్కరించుకుని డోకిపర్రు శివాజిపేట రామాలయాన్ని సందర్శించారు. రామాలయం ప్రాంగణంలో దసరా శరన్నవ రాత్రులను పురస్కరించుకుని ఏర్పాటు అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థుల ఆహ్వానం మేరకు కష్ణుడి ఆలయం, దుర్గాదేవి ఆలయాలలో జరుగుతున్న విజయదశమి వేడుకలలో వెనిండ్ల రాము పాల్గొన్నారు. క్రుష్ణుడి ఆలయం వద్ద నూతన ట్రాక్టర్ కు ఆయుధపూజ చేస్తున్న సమయంలో రైతు అంగడాల సహదేవుడి కోరిక మేరకు వెనిగండ్ల రాము నూతన ట్రాక్టర్ ను నడిపారు. డోకిపర్రు చిన్న వంతెన సమీపంలో ఇటీవల కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వెంకమ్మ హెూటల్ అగ్ని ప్రమాదానికి గురి అయ్యింది. వెంకమ్మ హెూటల్ తో పాటు మరో రొండు ఇళ్ళు అగ్నికి ఆహుతి అయ్యాయి. అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని వెనిగండ్ల రాము సందర్శించారు. బాదితులను పరామర్శించిన వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వీరమాచనేని శివప్రసాద్, శివాజీ రెడ్డి, వీరమాచనేని జయరాం మురళీ కష్ణ, మహబూబ్ భేగ్, మాజీ సర్పంచ్ జోగి వెంకటేశ్వరరావు, ఎ.ఏసుపాదం, శ్రీరాములు పాల్గొన్నారు.



అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న వెనిగండ్ల రాము

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి : లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ ఎండీ వేములపల్లి రవికిరణ్ పుట్టినరోజు వేడుకలు స్నేహితుల ఆధ్వర్యంలో చల్లపల్లి సీయోను అనాథ వృద్ధుల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి..వద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, టీడీపీ నేతలు రావి చిట్టి, మిక్కిలినేని మధు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలకు పూర్తిగా నీరు విడుదల చేయాలి : సిపిఎం



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సిపి రెడ్డి తదితరులు

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో పంట కాలువలకి పూర్తిగా నీరు విడుదల చేయాలని సిపిఎం గుడివాడ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. గుడివాడ సుందరయ్య భవన్లో మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు వరి మొత్తం పొట్ట దశలో ఉంది కాబట్టి పుష్కలంగా నీళ్లు లేకపోతే పంట తప్పా తాలు వచ్చి పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. దీనివల్ల ఎక్కువ రైతు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఎక్కువగా నీటిని విడుదల చేయించి పంట కాలువలకు ఇవ్వాలని కోరారు. ఈ సంవత్సరం వర్షాలు కురిసినా సరిగ్గా రైతాంగానికి ఉపయోగపడలేదని చెప్పారు. ఇప్పటికీ ఇరిగేషన్ అధికారులు వంతులు వారీగా కాలువలకు నీరు ఇస్తున్నారని, శివారు భూములకు నీరు సరిపోవటం లేద దాని రీత్యా దిగుబడి తగ్గుతుంది కాబట్టి రైతు కూడా ఇంజన్లు పెట్టుకొని నీరు తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దీని అదనపు భారం రైతు మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌతరం ఇరిగేషన్ లాకులు వద్ద పెడన నియోజకవర్గ ఎంఎల్‌ఎ జోగి రమేష్, ఏలూరు జిల్లా కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావులు అవగాహనకు వచ్చి క్యాంపిబీల్, పోలరాజు కాలువలకు నీరు తీసుకోటానికి రాజీ కుదిరించారని, మిగిలిన గుడివాడ, పామర్రు నియోజకవర్గానికి నీటి సరఫరా పరిస్థితి ఏంటి అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతాంగం ఇబ్బంది పడే పరిస్థితి ఉంది కాబట్టి అక్కడ ఉన్న ఇరిగేషన్ అధికారులు పైనుంచి నీళ్లు ఎక్కువ వదిలించడం వాళ్ళకి సరఫరా చేసే ప్రయత్నం చేసి రైతు వ్యవసాయ సలహా కమిటీలు సమస్యను పరిష్కరించాలని సలహా కమిటీ సభ్యులు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఆర్ కొండ, పి రజిని తదితరులు పాల్గొన్నారు.

దే...వుడ !

కవికాలమ్

తెల్లారింది మొదలు గుడి గంటలు...
సొమ్ములతో రా రమ్మని పిలుపులు !
ధర్మ గంట రమ్మంటోంది
ధర్మ హుండీ తెమ్మంటోంది !
దైవ దర్శనంకు ముందే
రుసుముల బోర్డుల దర్శనం !
ధర్మ సూత్రాలకు లేదు చోటు
ధరవరలకే చాలదు ఎంత చోటూ !
ఆలయ ప్రవేశం..ఇప్పుడెంతో ప్రియం
రుసుమును బట్టే మరి ప్రవేశం !
దేవుడికి కావాల్సింది మనిషి కాదట
ఆన్‌లైన్లో డబ్బు పంపినా చాలట !
జనం కన్న ముందు ధనం
దేవుని పేరిట పోగవుతున్న వైనం !
ఉచిత దర్శనం రోజుల నిరీక్షణం
రుసుములతో గంటల్లోనే సాధ్యం!
భక్తుడి రాకతో దేవుడికి ఆహ్లాదం..
దైవ దర్శనంతో భక్తుడికి ఆనందం..!
మధ్యవర్తులదే పెత్తనం
పైసలిచ్చుకుంటేనే ప్రసన్నం !
క్యూలో నిరీక్షణతో నీరసం
మధ్యలో ఎక్కడో భక్తి కాస్తామాయం!
భగవంతుని ముందు అంతా సమానులు
దేవుని ముందే ముందు వెనకలు !
ముందునోళ్ళకి సర్వ దర్శనం
వెనకునోళ్లకి సగం వరకే ఆ భాగ్యం !
పళ్లెంలో రూపాయలకే ఆశీర్వచనాలు
లేకుంటే కానరావు ఏ మంత్రాలు !
దేవుడి ముందు తన్మయత్వంతో భక్తులు..
కదులు కదులంటూ అయ్యవార్ల కేకలు !
ఆలయాల్లో కానరాని భక్తి
పేరుకోసమే భక్తుల ఆసక్తి !
విరాళాలెన్ని గుమ్మరించినా
వికాసం గోరంతయినా కనిపించునా..?
వరసల్లో వేలకొద్దీ జనం
అందరిలో రాసులకొద్దీ పాపం !
రోజుకో గుడి..రోజుకో దైవం
పాపం..దేవుడు ఏడు ముక్కలు !
గోత్ర నామాల పఠనమే ముఖ్యం
దైవ ధ్యాస ఉందంటే కాదు నమ్మశక్యం !
దీపాల వెలుగుతో పాపాల హరణం
భగవంతుడే ఇచ్చునట అభయం !
ఆలయంలో భక్తి పారవశ్యం మటుమాయం
అంతటా ఆర్భాటాలు ఆరాటాల మయం !
అన్యమతస్థులకు ప్రవేశం లేదు
వారి భక్తి అంటుకుంటుందేమోనని డౌటు!
ప్రశాంతత పరివర్తనలకు లేదు చోటు
సంస్కతి సంప్రదాయాలకు చేటు!
దేవుడికి అన్ని వైపులా తెగ రాబడి
అయినా వేచి వుండాలి గంటల తరబడి !
గుడి !.. ఇప్పుడు అదో అంగడి !
దేవుడు కీలుబొమ్మ ! ధర్మకర్తల పిడికిట్లో
అయ్యో! ఆయన బయట పడేదెట్లో !?
ఊరంతా దేవాలయాలు ఉత్సవాలు
లోకమంతా పెరుగుతున్న అరాచకాలు! !
దేవుడికి నిత్య కళ్యాణం పచ్చ తోరణం
భక్తుడికి నిత్య పోరాటం ! తప్పని దారిద్ర్యం !
మనిషంటేనే ఓ కదిలే దేవాలయం ..
కల్మషం లేని మనసే కొలువైన దైవం!
మానవత్వమే అలంకారం
పాప పరిచ్ఛేదమే పూజా విధానం !
సత్కర్మలే దేవుడికి షోడశోపచారాలు
సర్వజన హితమే తీర్థ ప్రసాదాలు !!
ఆలయం..కావాలి పరివర్తన కేంద్రం
భక్తి విశ్వాసాలతో పోవాలి మాలిన్యం !
సేవా గుణమే సమస్త ధర్మ సమ్మతం !
మనిషిని చేరాలెప్పటికైనా ఈ సందేశం !
మారాలెప్పటికైనా ఈ మనిషి తత్వం !
కోరాలెప్పటికైనా సాటి మనిషి హితం !

- "వసుధ" 9490832787

27న గ్రూప్ 1, 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గ్రూప్ 1, 2 పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు విజయవాడ మారుతీనగర్‌లోని సిద్ధార్థ ఐఎఎస్ అకాడమీలో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సదస్సులో పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు పాల్గొని తమ అనుభవాలను వివరిస్తారని తెలిపింది. ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గురించి పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు రచించిన 100 పేజీల పుస్తక ఆవిష్కరణ ఉంటుందని, అనంతరం ఆ పుస్తకాలను అభ్యర్థులకు అందిస్తామని పేర్కొంది. ఆశావహులు తప్పకుండా ఈ సదస్సుకు హాజరై ఉన్నతాధికారుల అనుభవాలను తెలుసుకోవాలని, సూచనలు పాటించి గ్రూపు 1, 2 పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని ట్రస్ట్ ఆకాంక్షించింది.

రామమోహన గ్రంథాలయ సమావేశ మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నరుపేట ఎంజి రోడ్‌లోని రామమోహన గ్రంథాలయంలో చేపట్టిన మరమ్మతుల్లో భాగంగా పునర్నిర్మించిన తూర్పు పక్క గదిలో సమావేశ మందిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ముందుగా అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు దసరా సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించి సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వేములపల్లి కేశవరావు మాట్లాడుతూ 100 మంది వరకు కూర్చోడానికి అవకాశం ఉన్న ఈ సమావేశ మందిరాన్ని గ్రంథాలయం నిర్వహించే కార్యక్రమాలకు ఉపయోగించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంల ో గ్రంథాలయ కమిటీ సభ్యులు తంగిరాల రఘురాం, చిగురుపాటి నరేష్, మద్దినేని పవన్, జె.పద్మ, కోటా శ్రీకష్ణ భగవాన్, లైబ్రేరియన్ కె.దుర్గా దేవి, గ్రంథాలయ సిబ్బంది శ్రేయోభిలాషులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు వందన సమర్పణ చేశారు.



బాధితులను ఆదుకుంటాం

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజన మహిళలపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళలను మంగళవారం రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌తో కలిసి ఆయన పరామర్శించారు. దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు ధైర్యం చెప్పారు. రూ.50 వేలు తక్షణ పరిహారంగా మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వు కాపీలను బాధితులకు అందజేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో శంకర నాయక్ మీడియాతో మాట్లాడుతూ గిబాధితురాలైన గిరిజన మహిళలను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్, సభ్యుల వెంట జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫణి ధూర్జటి, రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, జిల్లా యానాది సంఘాల అధ్యక్షులు శ్రీనివాసరావు ఉన్నారు.



గిరిజన మహిళలపై దాడి అమానుషం : కెవిపిఎస్

మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళలను కెవిపిఎస్ కృష్ణాజిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజేష్, ఉపాధ్యక్షులు కొడాలి శర్మ, నగర అధ్యక్షులు ఎం.ఆనంద్ బెనర్జీ, నాయకులు బాబూరావు, ఐద్వా పట్టణ నాయకులు కొడాలి సుజాత, బూరా భవానీ, చీరువోలు విజయలక్ష్మి, పద్మ, సిఐటియు నాయకులు బూరా సుబ్రహ్మణ్యం, చిరువోలు జయరావు పరామర్శించారు. అనంతరం ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్‌ను కలిసి దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కేసు : జెసి డాక్టర్ అపరాజిత సింగ్

ముగ్గురు గిరిజన మహిళలపై అమానుషంగా దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఉన్న బాధిత మహిళలను ఆమె పరామర్శించి దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే నిందితులను అరెస్టు చేశామని చెప్పారు.

మహారాజశ్రీ నందిగామ 16వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

GWOP No:74/2023

Between:-

కొప్పుల ప్రసన్న జ్యోతి, భర్త (లేటు) సుమన్, హిందూ, 39 సం. లు, గృహిణి, డోర్ నెం. 3-55/1, రైతుపేట డౌన్, నందిగామ గ్రామం, మండలం ... పిటీషనర్

మరియు

పంది ఆదిలక్ష్మి, భర్త ప్రకాష్ రావు, హిందూ 40 సం.లు గృహిణి, యాదవ బజారు, నందిగామ గ్రామం, మండలం. ...రెస్పాండెంట్

నోటీసు

పై నెంబర్ పిటిషన్ లో రెస్పాండెంట్ కు ఎట్టి అభ్యంతరములున్న తెలుపుకునే నిమిత్తము పైకోర్టు వారి ఎదుట ది. 06-11-2023 వ తేదీన ఉదయం గం. 10:30ని.లకు వాయిదా అయిఉన్నది. సదరు వాయిదా రోజున కోర్టుకు హాజరు కాని యెడల మీ పరోక్షమున పిటిషన్ లో తీర్మానించబడును.

ఇట్లు
వేమూరు సత్య నారాయణ మూర్తి,
వివియల్ ఎన్ పూర్ణేష్,
పిటిషనర్ తరపు న్యాయవాదులు

తేదీ:12-10-2023 నందిగామ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు, పక్కన నిజాం

ప్రజా సంఘాల ఆధ్వర్యాన సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి - విజయవాడ : దసరా సందర్భంగా డివైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం అజిత్‌సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్లో సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ సిహెచ్.బాబురావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాబూరావు మాట్లాడుతూ డివైఎఫ్ఐ, ప్రజా సంఘాలు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కుల మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యతతో పండగలు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కొందరు మతోన్మాదులు ప్రజలను మతం పేరుతో, కులం పేరుతో విడదీస్తున్నాయని విమర్శించారు. ఇది దేశ ఐక్యతకే పెద్ద ప్రమాదమన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ సిటీ కార్యదర్శి ఎస్‌కె.నిజాముద్దీన్, అధ్యక్షులు యు.శివ, నాయకులు రసూల్, పీరు సాహెబ్, పిఎన్ఎం నాయకులు అప్పన్న, ఆశ, ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి ఝాన్సీ, పలువురు కళాకారులు, కళా గురువులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి దంపతులకు పరామర్శ

ప్రజాశక్తి - హనుమాన్‌జంక్షన్ :నాయకుల కుటుంబాలకు టిడిపి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. ఇటీవల జరిగిన ప్రమాదం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్న తుమ్మల ఉదయ్‌ని ఆయన పరామర్శించారు. మాజీ ఎంపీపీ తుమ్మల కోమలి, ఉదయ్ దంపతులను ప్రమాదం వివరాలు, ఆరోగ్య పరిస్థితిని తదితర విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, గండేపూడి నితీష్ కుమార్, ఏనమదుల సుధాకర్, తుమ్మల మధు, కంపసాటి కొండ, బుజ్జి, వడ్డీల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మహారాజశ్రీ అవనిగడ్డ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

ఓ.యస్.నెం. 16/2023

బిట్వీన్ :

తోట శివశంకర్ .... వాది

మరియు

కొక్కిలిగడ్డ పరమేశ్వరరావు ... ప్రతివాది

ప్రతివాది :

Kokkiligadda Parameswara Rao, S/o Nageswara Rao, Hindu, aged about 41 years, Properties, Previously did Business under Name and Style as Shanmuka Sea Foods, Business, Door No. 6-22, River Road, Nagayalanka Village, Nagayalanka Mandal, Krishna District.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారు ప్రతివాదికి దావా సమను అమలు నిమిత్తం ది. 31-10-2023వ తేదీకి ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ది. 31-10-2023వ తేదీన పై కోర్టువారి యెదుట మీరుగాని, మీ న్యాయవాది ద్వారా గానీ, ఉదయం 10-30 గం.లకు హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపగలరు. లేనియెడల వాజ్యం మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపరచటమైనది. ఈ పేపరు ప్రకటన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయటమైనది.

అవనిగడ్డ, ఇట్లు
ది.24-10-2023 **శ్రీ బొప్పన సుబ్రహ్మణ్యేశ్వరరావు,**
అద్వకేటు, అవనిగడ్డ.
సెల్ : 9949332270

మొదటిపేజీ తరువాయి

ఉత్సవాలు దుర్గగుడివి...ఖర్చులు విఎంసివి

రెండుశాఖల ఉన్నతాధికారులు చేసుకున్న ముందస్తు ఒప్పందం. కానీగత అనుభవాలను పరిశీలిస్తే... సదరు కాంట్రాక్టర్ ఏ మేరకు నిబంధనల ప్రకారంగా, న్యాయబద్ధంగా కార్మికులకు కూలి డబ్బులు సక్రమంగా ఇస్తారోననే ఆందోళనను సంబంధిత కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు వెయ్యి మంది కార్మికులను తీసుకురావాల్సిన సదరు కాంట్రాక్టర్ కేవలం నాలుగు వందల మందిని మాత్రమే పనిలోకి పెట్టినట్లు పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెబుతున్నారు. మిగిలిన కార్మికుల స్థానంలో విఎంసి కార్మికులతో పని చేయించారు. అంతేగాక కార్మికుల మస్టర్ విధానంలో ఎఫ్ఆర్ఎస్ ప్రకారం ఒక కార్మికుడి చేత రోజులో ఒక షిఫ్ట్ (ఎనిమిది గంటలు) మాత్రమే పని చేయించాలి. కానీ సదరు కాంట్రాక్టర్ నిబంధనలను ఉల్లంఘించి ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పని చేయించారని స్వయంగా బాధిత కార్మికులు తెలుపుతున్నారు. షిఫ్ట్‌కు కార్మికుడికి రూ.500 ఇవ్వాల్సిన ఉండగా, రెండు షిఫ్ట్‌లు పని చేయించుకొని కేవలం రూ.450 నుంచి 500 మాత్రమే ఇస్తామని కాంట్రాక్టర్ చెప్పినట్లు కార్మికులు తెలుపుతున్నారు. షిఫ్ట్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు ఇస్తారని పనిలోకి కుదుర్చుకునే ముందు కార్మికులతో మాట్లాడుకున్న సదరు మేస్త్రీలు, తీరా పనిలోకి వచ్చిన తరువాత రెండు షిఫ్ట్‌లకు కలిపి కూడా రూ.500 లోపు మాత్రమే కూలి ఇస్తామని కాంట్రాక్టర్ చెప్పినట్లు తెలిసింది. మంచినీరు, భోజనం, మరుగుదొడ్డి సదుపాయం, రాత్రి వేళల్లో నిద్రించడానికి అనువైన సౌకర్యాలు వంటివి ఏ ఒక్కటీ కూడా ఏర్పాటు చేయలేదని, ఈపది రోజులు తీవ్ర అవస్థలు పడినట్లు కార్మికులు వాపోతున్నారు. వివిధ జిల్లాల నుండి తీసుకొచ్చిన మేస్త్రీలు, సదరు కాంట్రాక్టర్ చేసిన మోసాలకు అతి తక్కువ కూలికి రాత్రింబవళ్లు చేయలేక కొందరు కార్మికులు తమ తమ ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే చేసిన పనికి ఇస్తామన్న కూలి డబ్బులు కూడా ఇవ్వలేదని చెబుతున్నారు. ఒకే కార్మికుడిని రెండు షిఫ్ట్‌ల్లో పెట్టినట్లు బయటకు తెలీయనీకుండా సదరు కాంట్రాక్టర్ పలు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ఒక షిఫ్ట్‌లో పారిశుధ్య పని చేయించడం, ఇదే కార్మికుడిని మరో షిఫ్ట్‌లో వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేయడానికి వినియోగించినట్లు పల్నాడు జిల్లా నకరికల్లు మండలానికి చెందిన ఇద్దరు మహిళా కార్మికులు చెప్పడం గమనార్హం. ఎవరో దాతలు, గుళ్లదగ్గర పెట్టిన అరకొర ఫలహారం, భోజనంతోనే కాలం వెళ్లదీయాల్సి వచ్చిందని, తాము పనిలోకి వచ్చేటప్పుడు ఎటువంటి డబ్బులు తీసుకొచ్చుకోలేదని, భోజనం కోసం తీవ్ర ఇబ్బందులు పడినట్లు ఆ మహిళా కార్మికులు ప్రజాశక్తి ఎదుట వాపోయారు. శానిటేషన్‌కు కేటాయించిన రూ.36 లక్షల్లో ప్రస్తుతం కార్మికులకు ఇస్తామన్న అతి తక్కువ కూలి లెక్క ప్రకారం సగానికి సగం డబ్బులు మిగులుతాయని, అవన్నీ కూడా పలువురు ప్రజాప్రతినిధులు, విఎంసి పాలకవర్గంలోని పలుకుబడి కల్గిన వారు, పలువురు అధికారులు సదరు కాంట్రాక్టర్‌తో రింగై కార్మికుల శ్రమను దోచుకునే పరిస్థితి ఉందని పలువురు అధికార పార్టీ కార్పొరేటర్లే బాహాటంగానే చెబుతున్నారు. సదరు కాంట్రాక్టర్ వ్యవహారంపై విఎంసి కమిషనర్ ఏ మేరకు విచారణ జరిపించి, కార్మికులకు న్యాయబద్ధంగా వారు చేసిన శ్రమకు తగిన కూలి ఎంత వరకు ఇప్పిస్తారోనని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

నేషనల్ సింపోజియంలో వక్కలగడ్డ పిఎసిఎస్‌కు గుర్తింపు

సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని మంత్రి అమిత్ షా నుండి సురేంద్రనాథ్ బెనర్జీ అందుకున్నారు. ఈసందర్భంగా బెనర్జీ మాట్లాడుతూ కేంద్ర మంత్రి నుండి ధ్రువీకరణ పత్రం అందుకునేందుకు దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఐదు సంఘాలలో వక్కలగడ్డకు స్థానం దక్కడం సంఘం పనితీరుకు నిదర్శనమన్నారు. సహకార మంత్రిత్వ శాఖ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడానికి కొత్త శకానికి నాంది పలికిందన్నారు. అందులో నేషనల్ కోఆపరేటివ్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ ఏర్పాటు ఒక కీలకమైన మిషన్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంఘ సభ్యులు కొల్లిపర సాంబశివరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I **(K) KOLA HEMA MALINI**, W/o (Late) KOLA SIVA NAGESWARA RAO, Resident of D.No. 24-29-222/6A, Saibaba Street 3rd Line, Gulabithota, Vijayawada, NTR District.

In My Aadar Card my name was wrongly mentioned as K.HEMA MALINI, instead of KOLA HEMA MALINI, and in my husband Defence Service Record my name was wrongly mentioned as Jalli Hema Malini, instead of KOLA HEMA MALINI, W/o KOLA SIVA NAGESWARA RAO. Both **JALLI HEMA MALINI and KOLA HEMA MALINI** are one and same and belongs to me only. For the purpose of Family Pensions and all future corrections.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT NANDIGAMA
M.V.O.P.No.66/2023

BETWEEN:

Shaik Meera Bee and another ... Petitioners

AND

Palanati Durga Prasad. ... Respondent

TO, [Respondent] : Palanati Durga Prasad, S/o. Krishnaiah, Hindu aged about 35 years, Driver cum Owner of Car bearing No. AP 10 AT 7340, R/o.D.No.7-1-155/D/13/6/5, Amulya Colony, Near Water Tank, Nalgonda, Telangana-508001.

Please take notice that the above named petitioners got filed the above M.V.O.P., for compensation against you and others and the same stands posted to 10-11-2023 for your appearance. There fore, you are hereby directed by this notice to attend before this Court on the said date at 10.30 a.m., either in person or through your advocate to answer the claim. Else, the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)

K.Krishna Rao, B.A., B.L.,
Advocate, 9848274420,
Bupathi Residence, Flat No. D.1,
Jaggaiahpet, NTR District.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No.745/2021
I.A.No.1534/2017
O.S.No.12/1997

పెసల పెద సుబ్బమ్మ
మరియు వగైరాలు - పిటిషనర్లు

Vs

లెక్కల అంకమ్మ (డైడ్)
మరియు వగైరాలు - రెస్పాండెంట్లు

To,

R5. **పెద్దిరెడ్డి రమణారెడ్డి,** తండ్రి **చిన్న పుల్లారెడ్డి,** C/o గ్యాసుబండ సుబ్బయ్య, R/o సీరియల్ నెంబరు 76/17, ఇంటి నెంబరు-597, చెన్నారెడ్డివీధి, విమల నగర్, భవాని పురం, విజయవాడ, కృష్ణా జిల్లా.

అయ్యా,

పై నెంబరు పిటిషన్‌లో పరిహారం కోరి మీ మీద పిటిషనర్స్, పిటిషన్‌ను దాఖలుచేసియుండుట వలన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నోటీసు పంపించి ననూ జారీ కానందువలన ఈ ప్రకటన ద్వారా తెలియజేయమని పై పిటిషన్‌ను **తే07-11-2023 దిన** వాయిదా వేసియున్నారు. కావున పై తేదీ యందు **ఉదయం గం|| 10-30 నిమిషములకు** పైకోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీని స్వయంగా గానీ,లాయర్ ద్వారా గానీ తెలుపుకొనవలసినదిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేదీ నందు మీరు హాజరుకానియెడల మీ పరోక్షమందు పై పిటిషన్‌ను తీర్మానించెదరు.

వాయిదా: 07-11-2023

//పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమందరావు
పిటిషనర్స్ తరపు అడ్వకేట్స్
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.



గుడ్లవల్లేరు మండలంలో...



గన్నవరం మండలం అల్లాపురంలో..



మచిలీపట్నంరూరల్‌లో...



బాపులపాడు మండలంలో...

ముగిసిన దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు సోమవారం తో ముగిశాయి. జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం శ్రీ అమ్మవారు శ్రీ మహిషాసుర మర్ధినీ దేవిగా (మహర్నవమి) మరియు సాయంత్రం నుండి శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం శ్రీ అమ్మవారికి అభిషేకం అనంతరం అమ్మవారికి నిత్యార్చన, సహస్ర కుంకుమార్చన, సమస్త నరగోష నివారణకు, సమస్త విజయ ప్రాప్తికి మన్యు సూక్త, ప్రత్యంగిర, శీతల,రుద్ర మూలమంత్ర హవన ములు తదుపరి "మహా పూర్ణాహుతి" నిర్వహించారు. సాయంకాలార్చన, శమీ పూజ, ఉయ్యాల (ఉంజల్) సేవ, పంచహారతులు, నీరాజన మంత్రపుష్ప ములు, చతుర్వేద స్వస్తితో శ్రీ అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్స వాలు ముగిశాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శేషం వీర వెంకట కష్ణ మూర్తి దంపతులు, సభ్యులు పామర్తి వెంకట స్వామి దంపతులు, వల్లూరు వెంకటరావు గారి దంపతులు, బాడిగ లీలా సౌజన్య , నారేపాలెం వెంకట నిర్మల పాల్గొన్నారు. అనంతరము భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అందజేశారు. అమ్మవారిని కష్ణాజిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము దంపతులు, కష్ణాజిల్లా న్యాయమూర్తి అరుణ సారిక, గుడివాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి. గాయత్రీ దేవి దర్శించుకున్నారు.**ప్రజాశక్తి-గుడివాడ :** శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు ముగిశాయి. మంగళవారం అమ్మవారు పలు దేవలయాలలో అమ్మవారిని పుష్పశయ్య అలకరణలో దర్శనమించారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానముఃలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలల్లో ముగింపులో భాగంగా అమ్మవారిని పుష్పశయ్య అలంకరణలో దర్శనమించారు. ఈ సందర్భంగా భీమేశ్వరస్వామి దేవలయం చైర్మన్ చందరాల హరిరాంబాబు, ఇఓ షణ్ముగ నటరాజన్ పాల్గొన్నారు. అలాగే స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానములో ఉత్సవాలు విజయవంతానికి సహకరించిన భక్తులకు ఈవో షణ్ముగ నటరాజన్, ధర్మకర్తల కమిటీ చైర్మన్ పంచకర్ల వెంకట్ ధన్యవాదాలు తెలియజేశారు.**ప్రజాశక్తి-గన్నవరం:** దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అల్లాపురం లో దసరా వేడు కల్లో అమ్మవారు మహిషాసుర మర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉదయం నుంచి అర్చకుడు ఆధ్వర్యంలో గణపతి పూజ మహ్యానాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి సహస్ర నామ కుంకుమార్చన , నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. విజయదశమి కావటంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వంశీ,ఎంపీపీ అన గాని రవి, సర్పంచి డొక్కు వెంకన్న బాబు పాల్గొన్నారు. వెయ్యి మందికి అన్న సమారాధన గావించారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నంలో పలు దేవాలయాల లో ఏర్పాటు చేసిన అమ్మవారిని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ సోమవారం దర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరాకు బందరు లో ప్రత్యేక స్థానం ఉందని కలకత్తా తర్వాత కాళీమాత రూపాన్ని ఒకవైపు మరోవైపు ఆంజనేయస్వామి రూపంతో ఉన్న శక్తి పటాలను ఏర్పాటు చేసి పటాల ఊరేగింపును నిర్వహించడం బందరుకు మాత్రమే ప్రత్యేకత అని అన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరికి ఉండేలా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కాంక్షించానని రామకష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షులుగడ్డంరాజు, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, డివిజన్ ఇన్చార్జిలు నాయకులు పినిశెట్టి వేణు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** విజయ దశమి వేడుకలు చల్లపల్లి రైతు బజారులో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రైతుబజారులో అమ్మవారికి వేద పండితులచే విశేష పూజలు జరిపించారు. రైతు బజారు కూరగాయల స్టాల్స్ మహిళా రైతులు, డ్వాక్రా స్టాల్స్ మహిళలు కుంకుమ పూజలు చేశారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి లంకె బలి చక్రవర్తి ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు కూరగాయల రైతులు, డ్వాక్రా స్టాల్స్ నిర్వాహకులు అమ్మవారికి ఘనంగా నవరాత్రులు నిర్వహించారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్:** అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్ర ప్రజలు అరాచకపాలన నుండి త్వరగా విముక్తి కలగాలని, తమ అధినేత నారా చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో అక్రమ కేసుల నుండి బయటకు రావాలని కోరుకున్నట్లు గన్నవరం నియోజవర్గం టిడిపి ఇన్ఛార్జ్ యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు.విజయదశమి సంద ర్భంగా బాపులపాడు మండలంలోని రంగన్నగుడెం, సింగన్నగుడెం, మల్లవల్లి, బాపులపాడు ఎమ్.జి నగర్, ఉమామేశ్వరపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గా మాతా విగ్రహాలకు తెదేపా నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబు అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ సంఘీ భావం తెలియచేశారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మల్పూరి సాయి కళ్యాణి, మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు , పుట్టా సురేష్, పుసులూరు లక్ష్మి నారాయణ, పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉయ్యూరు :** దసరా పండుగ పురస్కరించుకు ఉయ్యూరు పట్టణ, మండలపరిధి గ్రామాల్లో నిర్వ హించిన శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు అత్య ంత వైభవంగా జరిగిన ఉత్సవాల చివరిరోజు అమ్మవారి ఆలయాలు, మండ పాలకు భక్తులు పెద్ద యెత్తున తరలివచ్చారు. జగదంబా సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో చివరి రోజున మహిషాసుర మర్ధని, శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారిని అలంకరించి సాయంత్రం శమీపూజ నిర్వహించారు. చినఓగిరాల చింతలతోటలో ఉత్సవాల చివరి రోజైన సోమవారం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.



మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ కొడాలి బాబు

పొలాలకు సాగునీరందేలా చర్యలు

- ఇరిగేషన్ డిఇ కొడాలి బాబు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : ఏలూరు కాలువ పరిధిలోని చివరిభూములకు సాగు నీరందించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని, రైతులు అందోళన చెందవద్దని ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఇంజనీర్, విజయవాడ కొడాలి బాబు రైతులకు హామీ ఇచ్చారు. తిప్పనగుంట, సిరివాడ, అరుగొలను తదితర గ్రామల్లోని కాలువలను తిప్పనగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్, ఏఈ శ్రీనివాసరావులతో కలసి ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సకాలంలో సాగునీరందక వరిపంట ఎండిపోతుంన్నదని అధికారుల వద్ద రైతులు వాపోయారు. కొన్నిచోట్ల తూడు, చెత్త కాలువల్లో అడ్డుగా పడిఉండటాన్ని గమనించిన ఆయన కాలువల్లో అడ్డం కులను త్వరితగతిన తీసేలా చర్యలు చేపట్టాని ఆదేశించారు. ఎమ్మెల్యే వంశీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చామని, చివరి భూములకు కూడా సాగు నీరందేలా చర్యలు చేపడతామని డీఈ కొడాలి బాబు రైతు లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకాని బలరామయ్య, కాజ పున్నయ్య, మొవ్వా సురేష్ పాల్గొన్నారు.

శేషుబాబుకు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో ఇటీవల టిడిపి జనసేన బంద్ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుడివాడ శేషుబాబును పోలీసులు అదుపు లోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు చెప్పడం పట్ల టిడిపి ప్రజాప్రతినిధులు ఆయనకు సంఘీభావం తెలుపుతూ మంగళవారం పరామర్శించారు. చల్ల పల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మార్ల రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు సబ్జా చలపతిరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు రావి చిట్టి బా బు, శేషు బాబును పరామర్శించి సంఘీభావం తెలిపారు.

ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి హనుమాన్ జంక్షన్ : మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలో ఆర్యవైశ్య సేవా ట్రస్టును మహాసభ ఈ సి నెంబర్ పైడి సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య అతిథిగా గన్నవరం మ్మెల్యే వల్లభనేని వంశీ ప్రారంభించారు. అనంతరం సంఘ సభ్యులు వంశీని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు ఏకమై ఒకే మాటపై సేవా కార్యక్రమాలు అందించడం కోసం ట్రస్టును స్థాపించడం అభినందనీయమని కొనియాడారు. ఆర్యవైశ్య ట్రస్ట్ అభివద్ధి కోసం తన వంతు సహాయ సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యేవంశీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ అభివద్ధి కి సొంత నిధుల నుంచి ఐదు లక్షల రూపాయలు ఎమ్మెల్యే వంశీ విరాళం ప్రకటించారు. అనంతరం బాపులపాడు గ్రామంలోని హిందూ స్మశానం వాటిక వద్ద నూతనంగా నిర్మించిన షెడ్, వైకుంఠ రథం, ఫ్రిజర్ బాక్సులను ఎమ్మెల్యే వంశీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు నక్క గాంధీ, ఎంపీపీ యరగొర్ల నగేష్, బాపులపాడు గ్రామ సర్పంచ్ కమలాకిరణ్, బాపులపాడు మాజీ ఉపసర్పంచ్ కాకాని బాబు ,బాపులపాడు ఎంపీటీసీ కొనకళ్ళ వెంకటేశ్వరరావు, బాపులపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు దయాల విజయ ,ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రెసిడెంట్ చామర్తి రాంబాబు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య ట్రస్టు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వంశీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈ ఏడాది డిసెంబర్ 14 నుంచి 17 వరకు విజయవాడ ఎస్ కె చాంద్ కళ్యాణ మండపంలో(రైల్వే స్టేషన్ దగ్గర) జరిగే రెడ్ ఫ్లాగ్ 10వ మహాసభలను విజయవంతం చేయాలని రెడ్ ఫ్లాగ్ రాష్ట్ర కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు కోరారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని మచిలీపట్నంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు మాట్లాడుతూ పార్టీ 10వ జాతీయ మహాసభలను విజయవాడలో నిర్వహిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు మహాసభల్లో రూపకల్పన చేస్తామన్నారు. బిజెపి రెండోసారి అధికారం లోకి వచ్చినాక తన మతోన్మాద, మనువాద ఎజెండాను ముందుకు తీసుకువచ్చి భారత రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని సమాధి చేసిందని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా మతం, కులం, ప్రాంతీయ ఉన్మాదాల్ని పెచ్చరిల్లేలాగా బిజెపి పాలించిందని విమర్శించారు. ఈ కరపత్రం ఆవిష్క రణలో రాష్ట్ర నాయకులు కాగిత వెంకటేష్, మేడక చోనాష్, ఎస్ సత్యం పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని మోపర్రు గ్రామంలో నూతన సచివా లయాన్ని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులుకైలే అనిల్ కుమార్, సర్పంచ్ జూపల్లి రాజేశ్వరి ప్రారంభించారు. అనంతరం కైలే మాట్లాడుతూ సచివాలయాల్లో 546 రకాల సేవలు అందిస్తున్నా రన్నారు. సేవలన్నీ సచివాలయం ద్వారా అందజేస్తుండటంతో ప్రజల చెంతకు పరిపాలన చేరువైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, సచివాలయ మండల కన్వీనర్ జాజ్జుల చిన్నారి, జూపల్లి వెంకటరావు గోళ్ళ సోమేశ్వరరావు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో కేంద్ర మంత్రికి స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి ఘన స్వాగతం లభించింది. జిల్లాలో జరిగే పనులు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె ఢిల్లీ నుంచి వచ్చారు. కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.



కేంద్ర మంత్రికి స్వాగతం పలికిన నాయకులు

26న జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, స్కిల్ డెవలప్మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణ ఎన్టీయార్ జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అక్టోబర్ 26వ తేదీ అనగా గురువారం నాడు విజయవాడలోని ఫార్చ్యూన్ మురళీ హోటల్ సమీపంలోని పద్మజ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అవరణలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ జాబ్‌మేళాలో వరుణ్ మారుతీ, పద్మజ సుజుకీ, వరుణ్ బజాజ్ వంటి కంపెనీల్లో సర్వీస్ అడ్వైసర్, అసిస్టెంట్ టెక్నీషియన్, సేల్స్ అడ్వైసర్ డెంటర్స్, పెంటర్ తదితర పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని పదోవ తరగతి, ఐటీఐ, డిప్లొమా ఇన్ మెకానిక్స్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుండి 27 సంవత్సారాల లోపు నిరుద్యోగులు పూర్తి బయోడేటా, ధవపత్రాలు జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకి రూ.11 వేల నుండి రూ.15 వేల వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.http://www.ncs.gov.in వెబ్సైట్‌లో వివరాలను నమోదు చేసుకోగలరని తెలిపారు. ఇతర వివరాలకు 8142416211 నెంబర్‌లో సంప్రదించవచ్చని చెప్పారు.

ఐడిబిఐఎల్‌లో లాభాల నమోదు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సెప్టెంబరు త్రైమాసికంలో ఐడిబిఐ బ్యాంకు లాభాలను సాధించిందని బ్యాంకు రీజనల్ ఇన్‌ఛార్జి ఈశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు రూ.1323 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసినట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.828 కోట్లతో పోలిస్తే ఇది 60 శాతం అధికమని తెలిపారు. మొత్తం ఆదాయం రూ.6006 కోట్ల నుండి రూ.6924 కోట్లకు చేరిందని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తూనే మరిన్ని వినూత్న పథకాలతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో ఇంకా మెరుగైన అవకాశాలను బ్యాంకు ఖాతాదారులకు అందించనున్నట్లు తెలిపారు.

నూతన భవనంలోకి బాలాజీ హాస్పిటల్స్

నూతన ల్యాబ్‌తో డయాబెటిక్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ, మేయర్



బాలాజీ హాస్పిటల్ నూతన భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి



ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ల్యాబ్

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక భవానీపురం స్వాతి థియేటర్ రోడ్డులో నూతనంగా నిర్మించిన భవనంలో బాలాజీ హాస్పిటల్స్ అండ్ డయాబెటిస్ సెంటర్ సోమవారం ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని నూతన భవనంలో ఏర్పాటు చేసిన బాలాజీ హిస్పటల్స్, డయాబెటిక్ సెంటర్‌ను దసరా పండుగ విజయదశమి రోజున సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సదుపాయాలతో గొల్లపూడి, భవానీపురం, వన్‌టౌన్ చుట్టుపక్కల ప్రాంతాల వారికి 50 పడకలతో ఆస్పత్రి నిర్మించి, వైద్య సేవలు అందుబాటులోకి తేవటం అభినందనీయమన్నారు. హాస్పిటల్ నిర్వాహకులు, ప్రముఖ డయాబెటిక్ వైద్యులు డాక్టర్ ఆర్ఎల్ వి. ఫణికుమార్, డాక్టర్ డి.అనూష మాట్లాడుతూ సొంత భవనం నిర్మాణం ద్వారా ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గతంలో కన్నా మరిన్ని ఎక్కువ వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ నూతన భవనంలోకి హాస్పిటల్‌ను మార్చినట్లు తెలిపారు. అతి తక్కువ ధరతో కంప్లీట్ హెల్త్ చెకప్ సేవలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. త్వరలోనే 24 గంటల వైద్య సేవలను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అత్యంత ఆధునీకరమైన పరికరములతో విజయవాడలో మొదటిసారిగా త్వరలో రోచ్ సి 311, ఈ 411 అనలైజర్స్, సిమెన్స్‌సెంట్యూర్ సిపి అనలైజర్లు, మోస్ట్ అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రజలు తమ వైద్య సేవలు అందిపుచ్చుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవంలో పలువురు డాక్టర్లు, అభిమానులు, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎం.డి. ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి తదితరులు పాల్గొని డాక్టర్లు ఫణికుమార్, అనూషలకు అభినందనలు తెలియజేశారు.

సిమెంట్ అండ్ టైల్స్ షాప్ ప్రారంభం



షాపును ప్రారంభించిన ఫ్యాబ్రిక్ కంపెనీ అధినేత బోడెపూడి అప్పారావు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేతనకొండలో నూతనంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సిమెంట్ అండ్ టైల్స్ షాప్‌ను సోమవారం ప్రారంభించారు. కొమ్మూరు రాజారావు ఏర్పాటు చేసిన షాపును ఫ్యాబ్రిక్ కంపెనీ అధినేత బోడెపూడి అప్పారావు విజయదశమి పండుగ నాడు ప్రారంభించారు. మొదటిగా కొనుగోలు చేసి షాపు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపి దినదిన అభివద్ధి చెంది మంచి లాభాలు చేకూరాలని ఆ దుర్గమ్మను వేడుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరు ఆచారావు, సాయి, ఇబ్రహీంపట్నం మండల కోబి ఆప్షన్ మెంబర్ పఠాన్ నాగులు మీరా తదితరులు పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న పి.వి.ఆంజనేయులు

ప్రజా రక్షణభేరిపై

4, 5 తేదీల్లో ప్రచారయాత్ర

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : నవంబర్ 4, 5 తేదీల్లో మండలంలో జరిగే ప్రచార యాత్ర జయప్రదం చేయాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం మండల సీనియర్ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, డీజిల్ పెట్రోల్ ధరలు, మహిళల రిజర్వేషన్ వంటి సమస్యలపై, కాంట్రాక్టు వర్కర్స్ కనీస వేతనం వంటి సమస్యలపై నవంబర్ 15న జరిగే సిపిఎం బహిరంగ సభకు మైలవరం నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జై.వెంకట్ రెడ్డి, ఉయ్యూరు కష్ణారెడ్డి, జి.అప్పి రెడ్డి, జి.వెంకటరెడ్డి, చంద్రరావు, బాబు, కోటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, రామిరెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రుల ముగింపు చిత్రమాలిక



హంసవాహనం ఊరేగింపు




హోమం చేస్తున్న ఆలయ అర్చకులు



ఊరేగింపులో పాల్గొన్న ఆలయ ఇఒ, ఛైర్మన్



శ్రీ మహిషాసుర మర్దిని



విద్యుద్దీప కాంతులతో ఇంద్రకీలాద్రి



శ్రీ రాజరాజేశ్వరీ దేవి



దర్శనం చేసుకుంటున్న యాత్రికులు



క్యూలైన్లో యాత్రికులు, భవానీలు



ఘాట్‌లో యాత్రికుల స్నానాలు



క్యూలైన్లో వేచి ఉన్న యాత్రికులు



తలనీలాలిస్తున్న యాత్రికులు, భవానీలు